ఆంధ్రజ్యోతి

జోగులాంబ గద్వాల

7

ఆదివారం 12 మే 2024

మద్యం దుకాణాలు సీజ్

ఆత్మకూరు,మే11: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఆత్మకూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని మూడు వైన్స్ షాపులను సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే శాశ్వతంగా లైసెన్స్ రద్దు చేయడమే కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్‌ఐ తెలిపారు. ఎన్నికల అనంతరం మళ్లీ ప్రారంభించుకోవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ ఎండి కదిర్, మహమ్మద్ పాషాలు పాల్గొన్నారు.

పదేళ్లు వంచనకు గురిచేసిన పాలకులను శిక్షించాలి

- ప్రముఖ సామాజిక విశ్లేషకుడు పరకాల ప్రభాకర్



సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ సామాజిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్

పాలమూరు, మే11 : పదేళ్లు వంచనకు గురి చేసిన పాలకులను శిక్షించాలని ప్రముఖ సామాజిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్.ఎం ఫంక్షన్‌హాలులో పదేళ్ల పాలనలో 'ప్రజా జీవితం-దేశ భవిష్యత్తు' అనే అంశంపై రాజ్యాంగ పరిరక్షణ కమిటీ, తెలంగాణ ప్రజా జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పదేళ్లగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ భారత ప్రజలను వంచనకు గురిచేసిందన్నారు. రక్తసంబంధీకుల్లా ప్రేమగా ఉన్న భారత ప్రజల మధ్య మత చిచ్చును రేపి రక్తపాతం సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతం మాటున నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచారన్నారు. బీజేపీ ఎన్నికల్లో మతాన్ని అస్త్రంగా ఉపయోగిస్తున్నారని విమర్శించారు. అటువంటి పాలకులను శిక్షించడమా.... మళ్లీ గద్దెనెక్కించడమా ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. మతోన్మాదులను శిక్షించకుంటే వాళ్లు మొత్తం భారత ప్రజలను శిక్షిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో స్త్రీలను వివస్త్రాలు చేయడం, నాగరిక సమాజానికి మాయని మచ్చగా మిగిలిందన్నారు. భారత ప్రజలు మతోన్మాదం నుంచి బయట పడితేనే రాబోయే తరాలకు ఈ దేశంలో జీవించే యోగ్యత కలిగి ఉంటుందన్నారు. ఉర్దూ పత్రిక సంపాదకులు జనాబ్ అమెర్ అలీఖాన్ మాట్లాడుతూ ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. మనం వేస్తున్న ప్రతి ఓటు దేశ భవిష్యత్తును ప్రతి ఫలిస్తుందని తెలిపారు. తెలంగాణ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న ఎన్నికలు రాజకీయ పార్టీల మధ్యన కాదని, నియంతృత్వ బీజేపీకి సబ్బండ భారతీయులకు మధ్య జరుగుతున్న ఎన్నికలన్నారు. తెలంగాణ ప్రజా జేఏసీ కో-కన్వీనర్ కె.రవిచంద్ర మాట్లాడుతూ భారత సమాజంలో బీజేపీ వెదజల్లిన విషం కడగడం కోసం అనేక ఏళ్లు పడుతుందన్నారు. పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ యం.రాఘవచారి మాట్లాడుతూ పదేళ్లకాలంలో ప్రజాస్వామ్యవాదులను మేధావులను నిర్బంధం ద్వారా జైల్లో పెట్టారని, ప్రజల వైపు మాట్లాడే అనేకమందిపై ఉపా కేసులు నమోదు చేశారన్నారు. సమావేశంలో టీఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, నాయకులు హనీఫ్‌అహ్మద్, సుధాకర్, షేక్‌సిరాజ్, షేఖ్‌అబ్దుల్లా, మౌలానా తాజముల్, షేక్‌అబ్దుల్లా, మౌలానా తాజముల్, జనజ్వాల, లక్ష్మణ్‌గౌడ్, గట్టన్న , మోసిన్‌పాషా ఖాద్రి, తిమ్మప్ప, శ్రీశైలం, వెంకటేశ్వర్లు, పద్మావతి పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల రిమాండ్

- 24 గంటల వ్యవధిలో కేసును ఛేదించిన పోలీసులు

- వివరాలు వెల్లడించిన ఎస్ఐ శ్రీహరి



సోలీపూర్‌లో హత్యాయత్నం చేసిన నిందితులతో ఎస్ఐ శ్రీహరి

ఖిల్లాఘణపురం, మే11: వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం సోలీపూర్ గ్రామంలో మంగనూరు చంద్రమ్మపై శుక్రవారం తెల్లవారు జామున హత్యాయత్నం చేసిన కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. నిందితులు మీసాల బాలరాజు, మంగనూరు మహేష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం ఎస్ఐ శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగనూరు చంద్రమ్మపై హత్యాయత్నం చేసిన సమయంలో కుక్కలు మొరగకపోవడంతో తెలిసినవాళ్లే అఘాయిత్యానికి పాల్పడి ఉంటారనే కోణంలో దర్యాప్తు చేశారు. ఇంటి పక్కనే ఉండే పాలివాళ్లు మంగనూరు గ్యాస్ కుర్మయ్య కుమారుడు నరేష్‌కు కాలికి గాయం కావడంతో మూడు రోజుల క్రితం మృతి చెందాడు. ఆరు నెలల క్రితం గ్యాస్ కుర్మయ్య భార్య సూర్యమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. వరుసగా ఇంటిలో మరణాలు సంభవిస్తున్నాయని గ్యాస్ కుర్మయ్య కుటుంబసభ్యులు గద్దె దగ్గర విచారణ చేయగా పాలివాళ్లు చేతబడి చేస్తున్నారని తెలిపారు. దాంతో మంగనూరు చంద్రమ్మ చేతబడి చేయడం వల్లే కుటుంబంలో వరుస మరణాలు జరుగుతున్నాయని అనుమానించి కుర్మయ్య కుమారుడు మంగనూరు మహేష్ అతడి బావమరిది మీసాల బాలరాజు హత్య చేయడానికి ప్రయత్నించారు. మృతి చెందిన నరేష్ బట్టలు వేసుకుని చంపితే నరేష్ ఆత్మ సంతోషిస్తుందని మంగనూరు మహేష్‌ను కాపలా ఉంచి మద్యం మత్తులో మీసాల బాలరాజు నిద్రలో ఉన్న చంద్రమ్మ నోరు మూసి కమ్మ కత్తితో చెవి, గొంతుపై ఇష్టారీతిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచి మృతి చెందిందని భావించి పరారయ్యాడు. దాడికి పాల్పడిన కమ్మ కత్తి, ధరించిన బట్టలను బ్యాగ్‌లో పెట్టి వనపర్తి చెరువులో పడేశారు. పోలీసులు అనుమానంతో వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా చేతబడి చేసిందని చంద్రమ్మపై హత్యాయత్నం చేసినట్లు నిందితులు బాలరాజు, మహేష్ ఒప్పుకున్నారు. హత్య చేయడానికి ఉపయోగించిన కత్తిని , బట్టలను వనపర్తి చెరువు నుంచి పోలీసులు సేకరించారు. కేసును 24 గంటల్లో ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్న కొత్తకోట సీఐ రాంబాబు, ఎస్ఐ శ్రీహరి, కానిస్టేబుల్ లింగం, ఆంజనేయులు, రమేష్, హోంగార్డు శ్రావణ్‌లను ప్రజాప్రతినిధులు, సోలీపూర్ గ్రామస్థులు అభినందించారు.

చిన్నారి గొంతులో ఇరుక్కున్న క్యారెట్ ముక్క

- 48 గంటలు శ్రమించి ప్రాణగండం తప్పించిన వైద్యులు



క్యారెట్ ముక్కను తొలగించే ప్రయత్నం చేస్తున్న వైద్య బృందం

కొత్తకోట, మే 11 : ఓ చిన్నారి గొంతులో క్యారెట్ ముక్క ఇరుక్కోని ప్రాణ పాయస్థితిలో ఉండగా, వైద్యులు 48 గంటలు శ్రమించి ప్రాణగండం తప్పించిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో చోటు చేసుకుంది. శనివారం పట్టణంలోని రాహుల్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్ హరిన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోపి ఫిజా (3) రెండు రోజుల కిందట ఇంట్లో క్యారెట్ ముక్కను నోట్లో పెట్టుకుంది. మింగలేక పోవడంతో గొంతులోనే ఇర్కుంది. ఊపిరి ఆడక చిన్నారి అస్వస్థతకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రాహుల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిశీలించి డాక్టర్ హరిన్‌రెడ్డి తన బృందంతో సీపీఆర్ చికిత్స చేశారు. నోటిలోకి గొట్టం వేసి ఆక్సిజన్ అందించారు. స్కానింగ్‌తో ఏదోముక్క చిక్కునట్లు గుర్తించారు. బ్రాంకో స్కోప్ సహాయంతో ముక్కను తొలగించి వెంటిలెటర్‌పై వైద్యం అందించారు. 48 గంటల అనంతరం ఫిజా ఆరోగ్యం మెరుగు పడడంతో శనివారం డిశ్చార్జి చేశారు. ఫిజాకు పునర్జన్మ ప్రసాదించిన చిన్నపిల్లల డాక్టర్ మనీషారెడ్డి, పల్మొనాలజిస్ట్ డాక్టర్ వెంకట్‌రెడ్డిలకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

పీవీటీజీ గురుకుల పాఠశాలలో నేరుగా ప్రవేశాలు

మన్ననూర్, మే11: మన్ననూరు ఆదివాసీ బాలుర గిరిజన గురుకుల విద్యాల యం(పీవీటీజీ)లో 2024-25 విద్యా సంవత్సరంలో 3 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను నేరుగా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ నిమ్మల పద్మావతి తెలిపారు. ఆసక్తి గల చెంచు విద్యార్థులు నేరుగా ప్రవేశాలు పొందాలని కోరారు.

వాహనాల తనిఖీల్లో నగదు పట్టివేత



నర్వలో పట్టుబడిన నగదుతో పోలీసులు

నర్వ, మే 11 : నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం చౌరస్తాలో శనివారం పోలీసులు, ఎస్ఎస్‌టీ టీమ్ సభ్యులు వాహనాలు తనిఖీ నిర్వహించారు. మహాలక్ష్మి వైన్స్‌కు చెందిన పవన్‌రెడ్డి, శంకర్‌రెడ్డిల వాహనంలో రూ. ఏడు లక్షలు నగదు పట్టుబడింది. వైన్స్ షాపునకు చెందిన డబ్బులు అని తెలిపినా ఎలాంటి రశీదు లేకపోవడంతో డబ్బులను సీజ్ చేసి గ్రీవెన్స్ సెల్‌కు పంపినట్లు నర్వ ఎస్ఐ కుర్మయ్య తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

యన్మన్‌గండ్ల సమీపంలో...

నవాబ్‌పేట: మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని యన్మన్‌గండ్ల సమీపంలో శనివారం ఉదయం కారులో తరలిస్తున్న సుమారు రూ. ఐదు లక్షల నగదును ఎన్నికల పరిశీలకులు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధికి సంబంధించిన కారులో డబ్బు తరలిస్తున్నట్లు పక్కా సమాచారంతో అధికారులు దారి కాచి పట్టుకున్నట్లు తెలిసింది. అయితే కారులో డ్రైవర్ మాత్రమే ఉన్నట్లు తెలిసింది. స్వాధీనం చేసుకున్న డబ్బును జిల్లా కేంద్రానికి తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే డబ్బు పట్టుబడిన విషయం వాస్తవమేనని స్థానికులు తెలిపారు. కానీ, పట్టుకున్న అధికారులు ఎవరు, పట్టుబడిన డబ్బు ఎంత అనే పూర్తి విషయాలు తెలియాల్సి ఉన్నది.

తనిఖీల్లో మద్యం పట్టివేత

అలంపూర్ చౌరస్తా, మే 11: ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద జాతీయరహదారిపై తనిఖీలు ముమ్మరం చేశారు. శనివారం వివిధ ప్రాంతాలకు తరలిస్తున్న మద్యం పట్టుబడినట్లు ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. పుల్లూరు గ్రామానికి చెందిన ఈ నరేష్‌గౌడు అనే వ్యక్తి బైక్‌పై తరలిస్తున్న 17.55లీటర్ల మద్యం విలువ రూ.14534లు, నంద్యాలకు చెందిన శివకుమార్‌రెడ్డి అనే వ్యక్తి కారులో తరలిస్తుండగా 18.100లీటర్ల మద్యం విలువ రూ. 11960లు, కర్నూలు నగరంలోని సంతోష్‌నగర్‌కు చెందిన దూదేకుల రసుల్ అనే వ్యక్తి బైక్‌పై పంటపొలాలమీదుగా కర్నూలు వైపు తరలిస్తుండగా 8.640లీటర్ల, రూ.8640లు విలువ గల మద్యం సీసాలను తనిఖీల్లో పట్టుకున్నారు. ఇక ఫ్లయింగ్ స్కాడ్ ఆధ్వర్యంలో ఉండవల్లి మండల కేంద్రంలో జె వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఇంటి సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన 25.920లీ, విలువ రూ.27360,గల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి లింగేశ్వరబాబు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దేవరకద్ర, మే 11: ఎలాంటి అనుమతులు లేకుండా ఫిల్టర్ ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగన్న తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల పరిధిలోని అడవి అజీలాపూర్ గ్రామ సమీప వాగులో ఫిల్టర్ ఇసుక తయారు చేస్తుండగా గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుడి మల్కాపూర్ గ్రామ సమీపంలో..

హన్వాడ: మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని గుడి మల్కాపూర్ గ్రామ సమీపంలో శనివారం తెల్లవారుజామున ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. నవాబ్‌పేట మండలం సాకల్‌పల్లి గ్రామానికి చెందిన శంకర్‌నాయక్ ట్రాక్టర్‌గా గుర్తించి అతడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఉపాధి హామీ పనుల వద్దే ప్రచారం

- 15 రోజులుగా కూలీల వద్దకే వివిధ పార్టీల నాయకులు

- ముగిసిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారపర్వం



ఉపాధి కూలీల వద్ద సంక్షేమ పథకాలు వివరిస్తున్న కాంగ్రెస్ నాయకుడు మోపతయ్య

అచ్చంపేట, మే 11 : వేసవిలో రైతుల కు, రైతు కూలీలకు వ్యవసాయ పనులు లేకపోవడంతో అధికసంఖ్యలో ఉపాధి హామీ పనుల కోసం వెళ్తున్నారు. దాంతో గ్రామాలు ఉదయం సగానికి పైగా ఖాళీగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి వచ్చే నాయకులకు గ్రామాలలో ప్రజలు లేక బోసిపోవడం కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామ ప్రజలు పనిచేసే చోటికే వివిధ పార్టీల నాయకులు వెళ్లి కూలీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసుకొని ఓట్లు వేయాలని అభ్యర్థిస్తూ తమ పార్టీ అధికారంలోకి వస్తే చేయబోయ్యే మేనిఫెస్టోను వివరించారు. కొన్ని పార్టీల నాయకులు ముందస్తుగా కూలీలకు సమాచారం ఇచ్చి కూలీడబ్బులు చెల్లిస్తామని మాట తీసుకొన్నాకనే ప్రచారంలో పాల్గొంటున్నారు. ఏది ఏమైనా ఈ పార్లమెంట్ ఎన్నికల సందడి గ్రామాల్లో కనిపించనేలేదని చెప్పవచ్చు.

దొరల పాలన పోయి.. ఇందిరమ్మ రాజ్యం వచ్చింది

- మహిళలను లక్షాధికారులను చేస్తాం
- బీఆర్‌ఎస్, బీజేపీని బండకేసి కొట్టాలి
- గద్వాల, అయిజ కార్నర్ మీటింగ్‌లలో ఉప ముఖ్యమంత్రి భట్టి



గద్వాలలో రోడ్‌షోలో అభివాదం చేస్తున్న భట్టి విక్రమార్క; చిత్రంలో ఎంపీ అభ్యర్థి మల్లురవి



గద్వాలలో రోడ్‌షోకు హాజరైన ప్రజలు

గద్వాల/అయిజ టౌన్, మే 11 : 'రాష్ట్రంలో దొరల పాలన పోయి ఇందిరమ్మ రాజ్యం వచ్చింది.. రాష్ట్ర సంపదలో ప్రతీ పైసా పేదల కోసం ఖర్చు చేస్తాం, మహిళలను లక్షాధికారులను చేస్తాం, డ్వాక్రా మహిళా సంఘాలకు రూ.80 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇస్తాం' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శనివారం గద్వాల పట్టణంతో పాటు, అయిజ కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గద్వాలలో ఆయనకు ఘన స్వాగతం పలికి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దొరలు, గడీలు, బంగ్లాల పాలనలో సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితిలో భూసంస్కరణలతో ఇందిరాగాంధీ పేదల బతుకులు మార్చారని గుర్తు చేశారు. దేశంలో సంస్కరణలు తెచ్చి ఇందిరమ్మ పాలన తెచ్చారని అన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో దోపిడీ జరిగిందని అన్నారు. ప్రజల సొమ్మును ఆగం చేశారని అన్నారు. కాళేశ్వరం పేరుమీద ఇసుకలో ప్రాజెక్టు కట్టి నీళ్లపాలు చేశాడని అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, మూడెకరాల భూమి ఇవ్వలేదు కానీ రూ.ఏడు లక్షల కోట్లు అప్పు ఇచ్చాడని విమర్శించారు. నాలుగు నెలలు పాలన చేయని కాంగ్రెస్‌ను ఖజాన ఆగం చేస్తున్నారని విమర్శించడం సిగ్గుచేటన్నారు. నరేంద్రమోదీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ఇచ్చాడా అని ప్రశ్నించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తుచేశారు. ఉచిత ప్రయాణం, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ ఇస్తున్నామని వివరించారు. మహబూబ్‌నగర్‌లో ఎన్నికల కోడ్ ఉండటంతో విద్యుత్, గ్యాస్ పథకాలు అమలు కావడం లేదని, కోడ్ పూర్తయిన వెంటనే అన్నింటిని అమలు చేస్తామని వివరించారు.

నడిగడ్డకు వరాల జల్లు

నడిగడ్డ ప్రజలు కాంగ్రెస్‌ను ఎంతో ఆదరిస్తారని భట్టి విక్రమార్క అన్నారు. ఆలాంటి నడిగడ్డను బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించిందని వివరించారు. ఓట్లకోసం గట్టు ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన రాయి వేసిందని విమర్శించారు. మేము దానికి నిధులను విడుదల చేసి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా గద్వాలలో చేనేత బతుకులు మారడానికి చేనేత పార్కును అభివృద్ధి చేస్తామని, కోడ్ పూర్తయిన తర్వాత నిధులు ఇస్తామని అన్నారు. తుమ్మిళ్ల ప్రాజెక్టుకు రిజర్వాయర్‌లను నిర్మిస్తామని, నెట్టెంపాడులో 99, 100వ ప్యాకేజీ పనులను పూర్తిచేసి సాగు విస్తీర్ణం పెంచుతామని వివరించారు. గుర్రంగడ్డ బ్రిడ్జిని పూర్తిచేసి దీవి గ్రామ ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కలుపుతామని అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్య అని, కాంగ్రెస్‌కు ఓటువేసి మల్లురవిని గెలిపించాలని కోరారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ సరిత, మునిసిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్, సినీ నిర్మాత బండ్ల గణేష్, నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, గంజిపేట శంకర్, మధుసూదన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఆత్మగౌరవం తాకట్టు

అయిజ టౌన్ : దళితుల ఆత్మగౌరవాన్ని కేసీఆర్ ఫాంహౌస్‌లో తాకట్టు పెట్టి స్వలాభం కోసం బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్న ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ పరువు తీశాడని ఎంపీ అభ్యర్థి మల్లురవి పేర్కొన్నారు. శనివారం అయిజ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన జన జాతర ర్యాలీ, కొత్త బస్టాండ్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో దళితులు కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలని సూచించిన ప్రవీణ్‌కుమార్ నేడు బీఆర్‌ఎస్ కండువా కప్పుకొని స్వలాభం కోసం దళితుల ఆత్మగౌరవం తీశారని అన్నారు. ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ గతంలో ఖాకీ చొక్కా వేసుకొని ఎన్నో ప్రాణాలు తీసిన మేకవన్నె పులి అన్నారు. ప్రవీణ్‌కుమార్‌ను ఓడిస్తే పోలీస్ రాజ్యం పోయి ఇందిరమ్మ ప్రజా రాజ్యం వస్తుందన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

నవాబ్‌పేట, మే 11: ప్రైవేటు బ్యాంక్ ఒత్తిళ్లకు తాళలేక నవాబ్‌పేట మండలం దర్పల్లి గ్రామానికి చెందిన బాలమణి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబీకుల వివరాల ప్రకారం.. బాలమణి ఇంటి పేరుమీద కూతురు నర్సమ్మ పాలమూరులోని ఓ ప్రైవేట్ బ్యాంకులో రూ.తొమ్మిది లక్షల రుణం తీసుకుంది. వాయిదాలు చెల్లింపులో జాప్యం జరగడంతో బ్యాంకు అధికారులు బాలమణి ఇంటికి వచ్చి, ఒత్తిడి చేశారు. బాలమణి కూతురుకు తెలిపినా స్పందించకపోవడంతో శనివారం పురుగుల మందు తాగింది. జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు.

మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

» అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు



మూడవ విడత ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్న అధికారులు

గద్వాల న్యూటౌన్, మే 11 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సందర్భంగా పోలింగ్ సిబ్బందికి మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ శనివారం పూర్తి అయినట్లు అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు రుచేశ్ జైవన్సి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాలులో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో పోలింగ్ సిబ్బందికి సంబంధించిన మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను నాగర్‌కర్నూల్ రిటర్నింగ్ ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్, గద్వాల అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు సమక్షంలో ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో మొత్తం 594 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి గద్వాల నుంచి 1,456, అలంపూర్ నుంచి 1,400 మంది పోలింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో గద్వాల జిల్లా నుండి ఎల్‌డీఎం అయ్యపురెడ్డి, ఈడీఎం శివ తదితరులున్నారు.

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి

» ఎస్పీ రితిరాజ్ » శిక్షణ కానిస్టేబుళ్లకు అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ రితిరాజ్

ఎర్రవల్లి మే 11 : రేపు జరగనున్న పార్లమెంట్ ఎన్నికలను అన్ని ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీస్ శాఖ విధులు నిర్వహించాలని గద్వాల జిల్లా ఎస్పీ రితిరాజ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే శిక్షణ కానిస్టేబుళ్లకు శనివారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని పదో బెటాలియన్‌లో ఎస్పీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద జనాలు గూమిగూడరాదని, ప్రిసైడింగ్ అధికారుల సూచన మేరకు నడుచుకోవాలన్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూడాలని, విపత్కర పరిస్థితుల్లో ఉన్నతాధికారులకు సమాచారం అందించి పరిస్థితిని అదుపులోకి తేవాలన్నారు. అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, రాజకీయ పార్టీల నేతలు పోలింగ్ కేంద్రాల దగ్గర ప్రచారం చేయకుండా నిలువరించాలన్నారు. కార్యక్రమంలో కమాండెంట్ సాంబయ్య, సాయుధ దళ డీఎస్పీ నరేందర్, అలంపూర్ సీఐ రవిబాబు తదితరులున్నారు.

పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన సెక్టోరియల్ అధికారులు



పోలింగ్ స్టేషన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి సురేఖ

అలంపూర్ చౌరస్తా/ఉండవల్లి, మే 11 : సోమవారం జరగబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సెక్టోరియల్ అధికారులు పలు పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా శనివారం ఉండవల్లి మండల పరిధిలోని తక్కశిల, ప్రాగటూరు, శేరుపల్లి, మారమునగాల1, 2 గ్రామాలను వ్యవసాయాధికారి సురేఖ, మెన్నిపాడు, పుల్లూరు, బొంకూరు తదితర గ్రామాలను ఎంపీవో పద్మావతి, బస్వాపురం, ఉండవల్లి, భైరాపురం, చిన్నఆముదాలపాడు, కంచుపాడు గ్రామాలను ఎంపీడీవో అబ్దుల్‌జఫర్‌లు పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లలో తగు ఏర్పాట్లపై పరిశీలించినట్లు ఎంపీవో పద్మావతి తెలిపారు.

సందెట్లో సడేమియా..

» నిలిపివేసిన నిర్మాణ పనుల కొనసాగింపు

» నోటీసు ఇచ్చినా ఖాతరు చేయని యజమాని



పాతబస్టాండ్ ప్రధాన కూడలిలో షాపు ముందు కొనసాగుతున్న పిల్లర్ల పనులు

గద్వాల టౌన్, మే 11 : పట్టణంలోని పాతబస్టాండ్ సర్కిల్ సమీపం రథశాల ఎదురుగా చేపట్టిన ప్రైవేటు నిర్మాణ పనులను మునిసిపల్ అధికారులు శనివారం మరోసారి నిలిపివేశారు. గత మార్చి నెలలో ఇక్కడ చేపట్టిన నిర్మాణ పనులు అక్రమమని, నిబంధనలకు విరుద్ధమని తేల్చిచెప్పిన మునిసిపల్ అధికారులు వాటిని నిలిపి వేయించారు. కాగా 40 రోజుల అనంతరం ఒకవైపు మునిసిపల్ అధికారులు లోక్‌సభ ఎన్నికల విధుల్లో బిజీగా ఉండడంతో స్థలం యజమాని తిరిగి పనులను ప్రారంభించారు. విషయం తెలుసుకున్న మునిసిపల్ అధి కారులు పనులను నిలిపివేయించగా, మునిసిపల్ సిబ్బంది, స్థల యజమాని మధ్య వాగ్వాదం జరిగింది. దాదాపు 15 ఏళ్ల క్రితం నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని కొన్ని దుకాణాలను పాత యజమాని నుంచి ఇటీవల కొనుగోలు చేసిన స్థానిక వ్యాపారి ఉన్న దుకాణాల ముందు ఖాళీ స్థలంలో పిల్లర్లు వేసి మరో షాపు నిర్మాణానికి సిద్ధమయ్యారు. వెంటనే జోక్యం చేసుకున్న మునిసిపల్ అధికారులు వాటిని నిలిపివేయించారు. దీనిపై స్పందించిన దుకాణాల కొత్త యజమాని తమకు అమ్మకం చేసిన డాక్యుమెంట్, నక్ష ఆధారంగానే నిర్మాణం చేస్తున్నామని, మునిసిపల్ స్థలంలో ఒక్క అడుగు కూడా ఆక్రమణ చేయలేదని అధికారులకు వివరించారు. అయితే కొనుగోలు చేసిన డాక్యుమెంట్‌ను పరిశీలించిన అనంతరమే పనులకు అనుమతిస్తామని, అంతవరకు పనులు నిలిపివేయాలని మునిసిపల్ కమిషనర్ ఆదేశించారు. మునిసిపల్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండానే తిరిగి నిర్మాణ పనులు చేపట్టడంతో వాటిని మరోసారి నిలిపివేయించామని కమిషనర్ డి.శంకర్‌సింగ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

తీరని పిల్లిగుండ్ల కాలనీవాసుల దారి కష్టాలు



రైల్వే అండర్‌పాస్ కింద ఆగి ఉన్న వర్షపు నీటిలో వెళుతున్న పిల్లిగుండ్ల కాలనీవాసులు

గద్వాల అర్బన్, మే 11 : పట్టణానికి ఆనుకుని ఉన్న పిల్లిగుండ్ల కాలనీవాసుల దారి కష్టాలు తీరడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండురోజుల క్రితం కురిసిన చిన్నపాటి వర్షానికే రైల్వే అండర్ పాస్ కింద వర్షపు నీరు నిలిచి కాలనీలోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమకు రాకపోకలు కొనసాగించేందుకు ఏర్పాట్లు చేయాలని కాలనీవాసులు కోరారు.

బీఆర్ఎస్ హయాంలోనే వార్డుల అభివృద్ధి

» చివరి రోజు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి రోడ్‌షో

» కారుకు అండగా నిలవాలని కార్నర్ మీటింగుల్లో పిలుపు



గద్వాల కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల టౌన్, మే 11 : పట్టణంలోని అన్ని వార్డుల్లో పలు రకాల అభివృద్ధి పనులు బీఆర్ఎస్ పాలనలోనే సాగాయని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. పట్టణ ప్రగతి పేరున చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో ప్రజలకు సౌకర్యాలు మెరుగుపడగా.. ప్రకృతి వనాల ఏర్పాటుతో వార్డుల ముఖచిత్రాలే మారిపోయాయన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరిరోజు శనివారం పట్టణంలోని 27, 28, 36, 37వ వార్డుల్లో కార్నర్ మీటింగ్‌లు, రోడ్‌షోలతో ఇంటింటి ప్రచారాన్ని విస్తృతంగా కొనసాగించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రస్వామి, హనుమాన్ ఆలయాల్లో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ఎర్రమట్టి వీధి దర్గా వద్ద స్థానికులతో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగుల్లో మాట్లాడిన ఎమ్మెల్యే, నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు, ప్రతీరోజు ఎలాంటి ఆటంకం లేకుండా తాగునీటి సరఫరా చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. పదేళ్ల పాలనలో బీజేపీ నాయకులు మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలను సృష్టించడం తప్ప అభివృద్ధి కోసం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం ఏదీ లేదన్నారు. కేవలం అధికారం కోసం అలవికాని హామీలు గుప్పిస్తున్న కాంగ్రెస్‌ను, ఆడంబరం తప్ప అభివృద్ధి పట్టని బీజేపీని ఎన్నికల్లో తిరస్కరించాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి కోసం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ ఎండీ.బాబర్, కౌన్సిలర్లు మురళి, నరహరి శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ జి.వేణుగోపాల్, నాయకులు గోవిందు, మెహబూబ్, వంశీ, సీతారాములు, లడ్డురఘు, సూర్యప్రకాష్, మెహిద్దీన్, ఫరూక్, గంట రమేష్ తదితరులున్నారు.

కేసీఆర్ కుటుంబంపై రేవంత్‌రెడ్డి కక్ష సాధింపు

» అభద్రతాభావంతో కాంగ్రెస్ నాయకులు

» మాజీ ఎంపీ మందా జగన్నాథం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మందా జగన్నాథం

గద్వాల న్యూటౌన్, మే 11 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహంభావపూరిత మాటలతో కేసీఆర్ కుటుంబంపై కక్ష సాధింపులతోనే పబ్బం గడుపుతున్నాడే తప్ప ఇచ్చిన హామీలను తుంగలో తొక్కేస్తున్నాడని, ప్రజల అభివృద్ధి ఊసే ఎత్తడం లేదని మాజీ ఎంపీ మందా జగన్నాథం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారన్నారు. రాష్ట్రంలో సాగు, తాగునీటి సమస్యలు లేకుండా చేయడంతో పాటు, ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి గద్దె నెక్కిందన్నారు. మహిళలకు ఫ్రీ బస్సుతో ఆర్టీసీకి కోట్లలో నష్టం తెస్తున్న ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రూ.లక్ష రుణం ఉన్న రైతులకు మరో లక్ష రుణం తీసుకోండని, డిసెంబర్ తొమ్మిది నాటికి రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి రూ.లక్ష అప్పు ఉన్న రైతుకు మరో రూ.లక్ష రుణం బ్యాంకులు ఎలా ఇస్తాయో ఆయనకే తెలియాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులకు అభద్రతాభావం ఉందని, ప్రభుత్వం త్వరలోనే పడిపోతుందన్న విషయం వారిలో వారే చెప్పుకోవడం, భయాందోళనలో ఉండటం విడ్డూరంగా ఉందన్నారు. ఏబీసీడీ వర్గీకరణ జరిగేలా చూస్తామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీయే వర్గీకరణకు అడ్డంకి అని అన్నారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో విద్యావంతుడైన ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, నాయకులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, మల్లి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గోవిందు, కౌన్సిలర్ మురళి ఉన్నారు.

రాష్ట్రంలో సమగ్ర ప్రగతి బీజేపీతోనే సాధ్యం

» ఎన్‌హెచ్‌పీఎస్ జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్

» ధరూరులో బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా ప్రచారం



ధరూరులో మాట్లాడుతున్న ఎన్‌హెచ్‌పీఎస్ జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్

ధరూరు, మే 11 : రాష్ట్రంలో అభివృద్ధి, ప్రగతి బీజేపీతోనే సాధ్యమని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. అదే సమయంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి భరత్‌ప్రసాద్ గెలుపునకు ప్రతీ ఒక్కరూ శాయశక్తిలా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ధరూరులో ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా రంజిత్ కుమార్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు నాలుగు ఎంపీ సీట్లు కేటాయించిన బీజేపీకి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. బీజేపీ నలుగురు బీసీలకు అవకాశం ఇచ్చిందని, కానీ కాంగ్రెస్ పార్టీ బీసీలపైనే అగ్రవర్ణాలను పోటీకి నిలిపిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఓట్లు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ గద్వాల నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, బీజేపీ నాయకుడు ధరూరు కిష్టన్న, నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు శ్రీనివాస్‌యాదవ్, విష్ణు, ప్రేమ్‌రాజ్, రంగస్వామి, నాగరాజు, ధరూరు మండల ఉపాధ్యక్షుడు అడవి ఆంజనేయులు, మల్దకల్, భరోసా ఆంజనేయులు, రాము, వెంకటేష్, రంగస్వామి, లక్ష్మన్న, బంగి పరుష, నేతన్న, ఆశన్న, భూపతి, గొర్ల తిమ్మప్ప, నాగేష్, కార్తీక్ ఉన్నారు.

● వడ్డేపల్లి : మండల పరిధిలోని కొంకల గ్రామంలో బీజేపీ శక్తికేంద్రం ఇన్‌చార్జి రాజుగౌడ్ ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షుడు నరసింహులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ బూత్ అధ్యక్షుడు గుగ్గిల బుగ్గన నరసింహులు, నాయకులు హరికృష్ణ, ఆచారి భీమసేనరావు, కార్యకర్తలు ఉన్నారు.

'వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి'

ఎర్రవల్లి, మే 11 : నడిగడ్డలో అధిక సంఖ్యలో ఉన్న వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తానని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బోయలకు భరోసా కల్పించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతానికి వచ్చి తిరిగివెళ్తున్న భట్టి విక్రమార్కకు శనివారం బోయ వాల్మీకులు ఎర్రవల్లి చౌరస్తాలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వాల్మీకి రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటి, నాయకులు గట్టు తిమ్మప్ప, నీలిశ్రీను, మధునాయుడు తదితరులున్నారు.

గద్వాల మీదుగా తిరుపతికి మరో రైలు

గద్వాల అర్బన్, మే 11 : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సికింద్రాబాద్ నుంచి తిరుపతికి ఈనెల 11వ తేదీ శనివారం రాత్రి గద్వాల మీదుగా తిరుపతికి మరో రైలు ఏర్పాటు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మర్ స్పెషల్ రైలు ప్రతీ శనివారం రాత్రి 10:05 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి ఆదివారం ఉదయం 9:30 గంటలకు తిరుపతికి చేరుకుంటుందన్నారు. ఈ ప్రత్యేక రైలు సికింద్రాబాద్ నుంచి కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తిరోడ్, గద్వాల, రాయచూర్ జంక్షన్, మంత్రాలయం రోడ్, ఆదోని, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల కడప, రాజంపేట, రేణిగుంట జంక్షన్ స్టేషన్లలో ఆగుతుందన్నారు. ప్రయాణికులు ప్రత్యేక రైలును వినియోగించుకోవాలని సూచించారు.

ప్రత్యేకం పేరుతో చార్జీల భారం తగదు

గద్వాల టౌన్, మే 11 : ఎన్నికల సందర్భంగా హైదరాబాద్ నుంచి గద్వాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్న అధికారులు ప్రయాణికులపై అదనపు భారం మోపడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి శనివారం ఒక ప్రకటనలో అభ్యంతరం తెలిపారు. ఉద్యోగ, వ్యాపార అవసరాల నిమిత్తం హైదరాబాద్‌లో నివసిస్తున్న అనేకమంది ఓటు వేసేందుకు గద్వాలకు రావాల్సి ఉండగా ప్రస్తుతం ఉన్న బస్‌చార్జి రూ.260లను నుంచి రూ.320లకు పెంచి వసూలు చేయడం శోచనీయమన్నారు. దీంతో పాటు హైదరాబాద్ ఎంజీబీఎస్ నుంచి గద్వాల రావాల్సిన బస్సులను నేరుగా కర్నూలు పంపిస్తున్నందువల్ల గద్వాల ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. హైదరాబాద్ నుంచి నేరుగా గద్వాలకు బస్సులు నడపాలని, స్పెషల్ బస్సులకు అదనపు చార్జీలు వసూలు చేయొద్దని ఆయన ఆర్టీసీని కోరారు.

'పేదల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం'

మానవపాడు, మే 11 : పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జగన్‌నాయుడు అన్నారు. మండలంలోని చెన్నిపాడు, మానవపాడు, అమరవాయి, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు తదితర గ్రామాల్లో శనివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే పేదల అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతీ ఇంటికి పథకాలు అందించడమే కాంగ్రెస్ లక్ష్యమని వివరించారు. ప్రచారంలో పరమేష్, కలీం రామకృష్ణ, ప్రభాకర్, రమేష్ తదితరులున్నారు.

● అలంపూర్ : అలంపూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇస్మాయిల్ శనివారం 1500మంది కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. దేశం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల హామీలను ప్రజలకు వివరిస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

'అభివృద్ధికి సహకరిద్దాం'

మల్దకల్, మే 11 : కారు గుర్తుకు ఓటేసి అభివృద్ధికి సహకరించాలని బీఆర్ఎస్ మండల నాయకుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మల్దకల్ మండలంలోని కుర్తిరావులచెర్వు గ్రామంలో బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ తరఫున ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అదే విధంగా మల్దకల్ గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటన్న, ఎంపీటీసీ సభ్యురాలు జయమ్మల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమం

» కాంగ్రెస్ పార్టీ కల్లబొల్లి మాటలు నమ్మొద్దు

» ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి



ధరూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి

ధరూరు, మే 11 : రాష్ట్రంలో ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్‌దేనని, వచ్చే ఎన్నికల్లో మరోసారి పార్టీని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి ప్రజలను కోరారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ధరూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో బండ్ల జ్యోతి సమావేశమై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమైందన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని అన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధితో పాటు అన్ని గ్రామాలు అభివృద్ధి చెందాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు దౌలన్న, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, డీవై.రామన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ రామేశ్వరమ్మ, కార్యకర్తలు ఉన్నారు.

● వడ్డేపల్లి : మునిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఆర్ఎస్‌పీకి మద్దతుగా వడ్డేపల్లి మునిసిపల్ చైర్‌పర్సన్ కరుణసూరి శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు.

హక్కులు హరిస్తున్న బీజేపీని తరిమికొట్టాలి

» సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

» వార్డులు, గ్రామాల్లో వీధి సమావేశాలు



వీధి సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

గద్వాల టౌన్, మే 11 : రాజ్యాంగబద్ధ సంస్థలను విధ్వంసం చూస్తూ ప్రజాస్వామిక హక్కులను హరిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ, లౌకిక, సమగ్ర భారతాన్ని కాపాడుకునేందుకు ఇండియా కూటమి బలపరచిన కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లురవికి అండగా నిలవాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని పలు వార్డులు, తెలుగోనిపల్లి, లత్తిపురం, బీరెల్లి, తుర్కోనిపల్లి, ముల్కలపల్లి గ్రామాల్లో ఏర్పాటుచేసిన వీధి సమావేశాల్లో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి తరఫున విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా సమావేశాల్లో మాట్లాడిన ఆంజనేయులు, పదేళ్ల పాటు కేంద్రంలో అధికారం వెలగబెట్టిన నరేంద్రమోదీ దేశానికి చేసిన మేలు ఏమిలేకపోగా ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడంలో అగ్రగణ్యుడిగా నిలిచారని ఎద్దేవా చేశారు. 2014లో ఉదరగొట్టిన హామీల్లో ప్రధానమైన నల్లధనం వెలికితీత, రైతుల ఆదాయం రెట్టింపు, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు గాలికి వదిలిన పార్టీకి, నాయకులకు తగిన గుణపాఠం నేర్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉప్పేరు కృష్ణ, ఆశన్న, వెంకటేష్, ఉరుకుందు, రవి, కిరణ ఉన్నారు.

జీవాలకు అందని వైద్యం

» అంతరించిపోతున్న పశుసంపద

» ఆందోళన చెందుతున్న రైతులు, పెంపకందారులు



ర్యాలంపాడులో గొర్రెలను మేపుతున్న యజమాని

అలంపూర్, మే 11 : గ్రామాల్లో పశువులు, గొర్రెలకు మెరుగైన వైద్యం అందక పాడి పశువులు అంతరించిపోయే పరిస్థితి నెలకొంది. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో పశు వైద్యులు అందుబాటులో లేక పశువులు, గొర్రెలు మృత్యువాత పడుతున్నాయి. జీవాలకు మెరుగైన వైద్యం చేయించుకోలేక పట్టణానికి, ఆరోగ్య ఉపకేంద్రమైన క్యాతూరు పశువుల ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా పశువులకు వర్షాకాలం ప్రారంభంలో జూన్, జూలై నుంచి డిసెంబరు నెలల్లో గేదెలు, గొర్రెలను బయట తిప్పే సమయంలో వాతావరణ పరిస్థితుల ఒత్తిడి ఎక్కువై గాలికుంటు, పుడ్ ట్రాక్, నిమోనియా, చిటుకు వ్యాధులు, నీలి నాలుక, పీపీఆర్ అనే వైరస్ వ్యాధుల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. చిటుకు వ్యాధికి ఆరునెలలకు ఒకసారి, నట్టల మందు మూడునెలలకోసారి, పీపీఆర్ మందు సంవత్సరానికి ఒకసారి వేస్తారు. ప్రభుత్వం జారీ చేసిన మందులను ఆస్పత్రి సిబ్బంది, గోపాలమిత్ర వలంటీర్ల ద్వారా టీకాలు, వ్యాక్సిన్లు వేస్తారు. పశువులకు అత్యవసర రోగాలు వస్తే మండలంలోని మారుమూల గ్రామమైన క్యాతూరు పశువైద్యశాలకు తీసుకుని వెళ్లి వైద్యం చేయించాల్సి ఉంటుంది. అదే మండల కేంద్రంలో ఆస్పత్రి ఏర్పాటు చేసి ఉంటే ప్రజలకు అందుబాటులో ఉండేదని, నది అవతలి గ్రామాలకు చాలా దూరం కావడంతో పశువులకు అత్యవసర వైద్యం అందకపోతే వాటి పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పాల ప్యాకెట్లకు అలవాటు పడుతున్నారు..



గ్రామాల్లో కూడా ప్రజలు ఎక్కువగా పాల ప్యాకెట్ల వాడకానికి అలవాటు పడుతుండడంతో పశు సంపద అంతరించిపోతోంది. పాల ప్యాకెట్లకు అలవాటు పడిన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. పశువులకు అందుబాటులో ఆస్పత్రి ఏర్పాటు చేసి ఉంటే పశుసంపద పెరిగి పాల ఉత్పత్తి కూడా పెరుగుతుంది.

- గొల్ల మద్దిలేటి, భీమవరం

మెరుగైన వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం..



ప్రతీ నాలుగు గ్రామాలకు ఒక పశువైద్యశాలను ఏర్పాటు చేస్తే పశువులకు ఎప్పటికప్పుడు మెరుగైన వైద్యం చేయించుకోవచ్చు. అప్పుడే పాడిపశువుల సంపద పెరిగి పాల ఉత్పత్తి పెరుగుతుంది. పశువుల పాలు తాగితే ప్రజలకు మెరుగైన ఆరోగ్యం ఉంటుంది. అదేవిధంగా పాల ప్యాకెట్లకు అలవాటు పడకుండా నివారించొచ్చు.

- కుర్వ నాగశేషులు, ర్యాలంపాడు

దూరాన్ని బట్టి ఆస్పత్రులను ఏర్పాటు చేసుకోవచ్చు

గ్రామాలకు ఆస్పత్రులు అందుబాటులో ఉండాలంటే దూరాలను బట్టి ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రభుత్వ అధికారులు మాకు ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదు. ఉన్నటువంటి ఆస్పత్రుల్లోనే పశువులకు, గొర్రెలకు చికిత్సలను అందిస్తున్నాం. ప్రజల అభిప్రాయం సముచితంగానే ఉంది. వాటిపై ప్రభుత్వాలే దృష్టి పెట్టాలి.

- డాక్టర్ శిరీష, ఇన్‌చార్జి వైద్యాధికారి